క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా శాలివాహన సేవాసంఘం వారు వ్యవహరించారు. సాయంత్రం పల్లకిసేవ, గ్రామోత్సవం జరిగింది.

శాకంబరి అలంకారంలో పోలేరమ్మ



మనుబోలు : మనుబోలు కోదండరామపురం దేవాంగుల వీధిలో కొలువైన పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి కూరగాయలతో శాకంబరి అలంకరణ చేశారు. మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా నీలిశెట్టి విజయ్‌కుమార్, సుమతి దంపతులు వ్యవహరించారు.

డీఏఓ క్షేత్ర సందర్శన



రైతులకు సూచనలు చేస్తున్న డీఏఓ సత్యవాణి

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు గ్రామ పరిధిలోని వరి పొలాలను స్థానిక రైతులతో కలిసి జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) పి.సత్యవాణి మంగళవారం క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ఏఓ డి.రఘునాథరెడ్డి, ఇందుకూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజకుమార్, ఏడీఏ నర్సోజిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్



విద్యార్థులతో మాట్లాడుతున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సుధాకర్

పొదలకూరు : పాఠశాల విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శిక్ష సప్తాహ్‌లో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అభ్యసన, సంఖ్యాశాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం(ఎఫ్ఎల్ఎన్) నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చెప్పడంలో మెళకువలు, బొమ్మల ద్వారా అభ్యసనం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సుమారు 40 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టులపై నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్ రూపొందించిన 30 రకాల వైజ్ఞానిక నమూనాలు విద్యార్థులను విశేషంగా ఆకర్షించాయి. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని ఇన్‌చార్జి హెచ్ఎం సుధాకర్ వెల్లడించారు.

శానిటేషన్ విభాగాధికారులతో సమావేశం

నెల్లూరు(బారకాసు): వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నగరంలో పారిశుధ్య పనులను ప్రణాళికబద్ధంగా చేపట్టడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని అదనపు కమిషనర్ శర్మద పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలోని అన్ని ప్రధాన రోడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు గృహాల యజమానులను గుర్తించి వారి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా సూచనలివ్వాలని కోరారు. అన్ని కాలువల్లో పూడికతీత, మురుగు తొలగింపు పనులను రోజూ చేపట్టాలని ఆదేశించారు. చెత్తను తీసుకెళ్లే వాహనాల నుంచి వ్యర్థాలు రోడ్డుపై పడకుండా సరైన విధానం ద్వారా తరలించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై సమాచారం, చికిత్స, ఇతర వివరాల కోసం 0861 2316777 నంబర్‌లో సహాయక సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు.

పనుల్లేక.. జీవనం సాగక..

కొత్త ప్రభుత్వంలో ఉపాధి పనుల్లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా పెద్దగా లేకపోవడంతో ఆ రంగంపై ఆధారపడిన కూలీలు ఖాళీగా ఉంటున్నారు. దీంతో వారి జీవనం కష్టతరంగా మారింది. గత మూడు నుంచి నాలుగు నెలలుగా ఉపాధి పనులు లేకపోవడంతో కాలువలు, చెరువులు కర్రతుమ్మ చెట్లతో మూసుకుపోయింది. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతుండగా, తమకు ఉపాధి కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

ఖాళీగా ఉన్న ఉపాధి కూలీలు
- పలు మండలాల్లో స్వల్పంగా పనులు
- అవి కూడా నత్తనడకన సాగుతున్న వైనం
- మేట్ల ద్వారా మస్టర్లు వేయిస్తున్న అధికారులు
- ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు



ఉపాధి పనులు చేపట్టకపోవడంతో కోవూరు మండలం ఇనమడుగులో పూడిపోయిన పంట కాలువ



కోవూరు మండలం వేగూరులో పూడిపోయిన పంట కాలువ

పొదలకూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు సర్వేపల్లి నియోజకవర్గంలో నత్తనడకన జరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడి పనులను అక్కడే నిలిపివేయాల్సిందిగా ఆదేశాలు అందడంతో అధికారులు పనులను ఆపివేశారు. పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో మాత్రమే స్వల్పంగా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉపాధి జాబ్‌కార్డు ఉన్న కూలీలు వ్యవసాయ పనులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం ఉపాధిహామీ క్షేత్ర సహాయకులను తొలగించడంతో జరుగుతున్న పనులకు అధికారులు మేట్ల ద్వారా మస్టర్లను వేయిస్తున్నారు. తిరిగి కొత్తగా క్షేత్ర సహాయకులను ఎంపిక చేసేంత వరకు పనుల్లో వేగం పెరిగే అవకాశం లేదంటున్నారు.

మూడు మండలాల్లో..

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తోటపల్లిగూడూరు మండలంలో గడిచిన 40 రోజుల్లో జరిగిన 25 పనులకు కేవలం రూ.3 లక్షలు మాత్రమే ఖర్చుపెట్టారు. ముత్తుకూరులో 12 పనులకు రూ.18 లక్షలు, పొదలకూరు మండలంలో 20 పనులకు రూ.20 లక్షలు ఖర్చు చేసినట్టుగా తెలుస్తోంది. గ్రామాల్లో కూలి పనులు లభ్యం కాక పేదలు ఇబ్బంది పడకూడదని ప్రవేశపెట్టిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ప్రస్తుతం వెనుకబడింది.

పనుల్లో రాజకీయ జోక్యం

ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యం అధికంగా ఉందని తెలుస్తోంది. గ్రామాల్లో టీడీపీకి చెందిన నాయకుల అనుచరులు క్షేత్ర సహాయకుడి ఉద్యోగం కోసం పోటీ పడుతున్నారు. ఫలితంగా కూలీలను పంచుకుని పనులు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఒకే ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్న గ్రామాల్లో తమకంటే తమకని తీవ్ర పోటీ నెలకొనడంతో అధికార పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. పనులు మందకొడిగా సాగడానికి ఇది కూడా ఒక కారణంగా చెప్పుకుంటున్నారు. మేట్ల ద్వారా మస్టర్లు వేస్తున్నా పనులు మాత్రం టీడీపీకి చెందిన నాయకుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. గ్రామాల్లో అధికంగా వరవ కాలువల తవ్వకం జరుగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. పొదలకూరు మండలంలోని ఇనుకుర్తి, బిరదవోలు, పొదలకూరు, కనుపర్తి, నందివాయ తదితర పంచాయతీల్లోనే పనులు జరుగుతున్నాయి.

మొక్కుబడిగా పనులు

కోవూరు : మండల పరిధిలో ఉపాధి హామీ పనులు మొక్కుబడిగా జరుగుతున్నాయి. కోవూరు మండలంలో పది గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో ఏడు గ్రామాలకు మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. వారు కూడా అరకొరగానే పనులు చేస్తున్నారు. లేగుంటపాడు, గంగవరం, పడుగుపాడు గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేరు. దీంతో ఆయా గ్రామాల్లో నిరుపేద కూలీలు పనుల కోసం ఎదురు చూస్తున్నారు. పాటూరు, చెర్లోపాళెం, మోడేగుంట ఇనమడుగు, వేగూరు, కోవూరు, పోతిరెడ్డిపాళెంలలో గడిచిన రెండు మాసాల్లో ఒకటి లేదా రెండు పనులను మాత్రమే చేశారు. అందులోనూ చాలా మందికి కూలి నగదు చెల్లించలేదు. వీటితో పాటు సాయి కాలువ, యల్లవకాలువ, లోతు కాలువలు పూడిక తీయక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



కనుపర్తి పంచాయతీలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసులు(ఫైల్)



ముత్తుకూరు మండలం మామిడిపూడిలో పూడిక తొలగింపు పనులు చేస్తున్న కూలీలు

త్వరగా ప్రారంభించాలి



ఎన్నికలకు ముందు నిలిచిన పనులు ఇప్పటివరకు ప్రారంభించలేదు. కొత్త పనులకు మంజూరు రానందున ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి త్వరగా పనులు మంజూరయ్యేలా చూడాలి. వ్యవసాయ పనులు అరకొరగా ఉన్నందున ఉపాధి పనులు ఉంటే మాకు ఆసరాగా ఉంటుంది. సుమారు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.250 వరకు డబ్బులు వస్తుంది. అధికారులు చెబుతున్నట్టు వచ్చే నెల నుంచైనా పనులు ప్రారంభమయ్యేలా చూడాలి.
– ధనుంజయ, ఉపాధి కూలీ, కొడవలూరు

పంట కాలువల పూడిక తీయాలి



ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాలువల పూడిక తీసి రైతులకు సాగు నీరు అందించాలి. సాగు పనులు ప్రారంభమైనప్పటి కీ పంట కాలువల పూడిక తీయకపోవడం బాధాకరం. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు.
– ఈదూరు ప్రవీణ్, కోవూరు

పూడిక తీయకుంటే నీరు సాగదు



నేను ఐదెకరాల్లో వరిసాగు చేస్తున్నా. నా కయ్యకు సాగు నీరు రావాలంటే పంట కాలువలకు పూడిక తీయాలి. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగకపోవడంతో కాలువలు పూడికతో నిండిపోయాయి. దీనివల్ల సాగునీరు అందే పరిస్థితి లేదు. పాలకులు పట్టించుకుని పూడికతీత పనులు చేపట్టాలి.
– చీమలదిన్నె మల్లెంకొండయ్య, రైతు, పాటూరు, కోవూరు మండలం

నీరు రావడం లేదు



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. పంట కాలువ ద్వారా పొలంలోకి నీరు రావాలి. నేను కూలీల ద్వారా కాలువ పూడిక తీయించాలంటే చాలా భారం అవుతుంది. ఉపాధి హామీ పనులు సాగకపోవడంతో గడ్డి పేరుకుపోయి నీరు రావడం కష్టంగా మారింది. అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాలి.
– చలంచర్ల రాజా, రైతు, విడవలూరు

పనులు కల్పించాలి



గ్రామాల్లో ఉపాధి పనులు లేక ఖాళీగా ఉంటున్నాం. దీంతో జీవనాధారం కష్టంగా మారింది. పాలకులు సకాలంలో ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలి
– కేత మల్లికార్జున, పాటూరు, కోవూరు మండలం

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలన్నర గడిచినా ఇంత వరకూ ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించలేదు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది బదిలీల కోసం పనులను ఆలస్యం చేస్తున్నట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, పొర్లుకట్టలు తదితర పనులను వ్యవసాయ సీజన్‌కు ముందే పూర్తిచేస్తే రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. రైతులు ఇబ్బంది పడకుండా వెంటనే పనులు ప్రారంభించాలి.
– ఎం.ప్రదీప్‌రెడ్డి, మడమనూరు, మనుబోలు మండలం

కూలీల కడుపు కొట్టొద్దు



రెక్కాడితే కాని డొక్కాడని పేదలకు ఉపాధి పనులు ఉపశమనం కలిగిస్తాయి. వ్యవసాయ పనులు లేని సమయంలో మాలాంటి పేదలు, రైతు కూలీలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉపాధి పనులు నిలుస్తాయి. ప్రస్తుతం మూడు నెలలుగా ఉపాధి పనులు లేకపోవడంతో కూలీలకు రోజు గడవడం కష్టంగా మారింది. రాజకీయ కారణాలతో పనులను ఆలస్యం చేయడం మంచి పద్ధతి కాదు. కూలీల కడుపు కొట్టొద్దు.
– కంద్రాతి సుబ్బమ్మ, ఉపాధి కూలీ, అక్కంపేట, మనుబోలు మండలం

పేదలకు ఉపాధి కల్పించాలి



జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు ఉపాధి పనులు కల్పించాలి. ఉపాధి లేక పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నూతన ప్రభుత్వంలో అధికారులు ఈ పథకం అమలు విషయంలో శ్రద్ధ చూపించడం లేదు. పూడిపోయిన కాలువలు చాలా ఉన్నాయి. తక్షణం వీటి పూడిక తీసే పనులు కల్పించాలి.
– బందెల వెంకటరమణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు, ముత్తుకూరు

పనులు ప్రారంభమైతే ఊరట



ఉపాధి పనులు ప్రారంభమైతే మాకు ఊరటగా ఉంటుంది. ఎన్నికలకు ముందు నుంచి కొత్తగా పనుల మంజూరు నిలిపివేయడంతో గ్రామంలో ఉపాధి లేకుండాపోయింది. అప్పట్నుంచి ఇంకా పనులు ఆరంభించలేదు. సంబంధిత అధికారులను అడిగితే త్వరలోనే పనులు మంజూరు చేస్తారని, వచ్చే నెల నుంచి పనులుంటాయని చెబుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఆశాజనకంగా లేనందున ఉపాధి పనులు త్వరగా ప్రారంభిస్తే మాకు ఊరటగా ఉంటుంది.
– శ్రీనివాసులు, ఉపాధి కూలీ, కొడవలూరు

పనుల్లో వేగం పెంచాలి



ఉపాధి పనుల్లో వేగం పెంచాలి. గ్రామసభల్లో గుర్తించిన పనులను కూలీల ద్వారా చేపట్టాలి. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలకు ఎలాంటి వ్యవసాయ పనులు లభ్యం కావడం లేదు. ఉపాధి పనులపై ఆధారపడిన కూలీలకు పనులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని పనులు కల్పించాలి.
– కేతు రామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, దుగ్గుంట, పొదలకూరు మండలం

కామాక్షితాయి సేవలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని పురావస్తుశాఖ కార్యదర్శి డాక్టర్ జి.వాణిమోహన్, టీటీడీ కార్య నిర్వహణాధికారి శ్యామలరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. చక్ర నవావరణ పూజలు, అష్టోత్తర శతనామార్చన పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అతిథులను సత్కరించి తీర్థ ప్రసాదాలు, పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న వాణిమోహన్, శ్యామలరావు కుటుంబ సభ్యులు

అవగాహనతో డయేరియా, మలేరియాకు చెక్

- ఈఓపీఆర్డీ డేవిడ్

కొడవలూరు : అవగాహనతోనే డయేరియా, మలేరియాలకు చెక్ పెట్టొచ్చని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ సూచించారు. మండలంలోని మానేగుంటపాడులో డయేరియా, మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగలు ముసిరిన, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం, కలుషిత నీటిని తాగడం ద్వారా డయేరియా వస్తుందన్నారు. పరిశుభ్రమైన, తాజా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా డయేరియాను పారదోలాలన్నారు. దోమల కారణంగా మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు తీర్మానం చేశామని, దీనిని ప్రభుత్వానికి పంపి త్వరలోనే ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీటిని అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కళాజాతాలతో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి, ఉప సర్పంచ్ రాజవర్ధన్‌రెడ్డి, స్థానిక నేత బాలభాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

‘ఫ్యామిలీ డాక్టర్’తో పేదలకు మేలు

- వైద్యాధికారి ఎం.రామకృష్ణ

కొడవలూరు : ‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ అన్నారు. మండలంలోని రామన్నపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ గతంలో చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తితే దూరంలో ఉన్న వైద్యశాలకు వెళ్లలేక వ్యాధి తీవ్రరూపం దాల్చి ఇబ్బంది పడేవారన్నారు. ఇప్పుడా సమస్య లేకుండా ఇంటి వద్దకే వైద్యులు వచ్చి చిన్నపాటి ఆరోగ్య సమస్య ఉన్నా గుర్తించి ప్రాథమిక స్థాయిలోనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మాఫ్‌జాన్, హెచ్‌ఏ వెంకట్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రామన్నపాళెంలో వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

గడ్డివామి దగ్ధం



గడ్డిని పక్కన పెడుతున్న గ్రామస్తులు

విడవలూరు: మండల కేంద్రంలోని అంకమ్మ దేవాలయం వెనుక వైపునున్న గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం విడవలూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చిట్టేటి కమలాకర్ అనే వ్యక్తికి గడ్డివామి ఉంది. విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తగిలి నిప్పురవ్వలు గడ్డివామిపై పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారొచ్చి మంటలను అదుపు చేశారు.

షాదీమంజిల్‌లో వసతులు కల్పిస్తాం

పొదలకూరు : పట్టణంలోని షాదీమంజిల్‌లో మెరుగైన వసతులు కల్పిస్తామని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ముస్లిం నాయకులతో కలిసి మంగళవారం షాదీమంజిల్‌ను ఆయన పరిశీలించారు. షాదీమంజిల్‌లో వివాహాలు జరుపుకునేలా అన్నిరకాల వసతులు కోసం నిధులు సాధిస్తామన్నారు. జమీర్ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో కమిషనర్ రమణబాబుకు ఆ పార్టీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేబాల కాలువపై నిర్మించిన శ్లాబును చెన్నూరురోడ్డుకు కలుపుతూ ర్యాంప్ నిర్మించాలన్నారు. కాలువపై నిర్మించిన కాంక్రీట్ వాల్ శ్లాబుపై అక్కడక్కడ మ్యాన్‌హోల్స్ ఉన్నాయని, వాటికి మూతలు ఏర్పాటు చేయాలని తెలిపారు. చెన్నూరు రోడ్డు వద్ద ఉన్న కాలువకు ఇరువైపులా రక్షణగోడలు నిర్మించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, జానీబాషా, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సీహెచ్‌సీలో భోజన సదుపాయం

పొదలకూరు : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు ఉచితంగా భోజనం అందజేస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సీహెచ్‌సీలో మంగళవారం మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి వచ్చి ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందే వారికి భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం, రాత్రి రెండు వేళల భోజనం అందజేస్తున్నామని, డెలివరీకి వచ్చే మహిళలకు కూడా జనరల్ డైట్ కింద భోజనం పెడుతున్నట్టు చెప్పారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు భోజన వసతి వల్ల ఎంతో ఉపయోగం ఉందన్నారు.



చికిత్స పొందుతున్న రోగికి భోజనం అందజేస్తున్న డాక్టర్ ప్రసాద్

టీడీపీ నేత దాష్టీకం

- వైఎస్సార్‌సీపీ నేత, బంధువుల ఇళ్లపై దాడి
- ఇంట్లోని సామగ్రి ధ్వంసం
- చంపేస్తామంటూ బెదిరింపులు

ఇందుకూరుపేట : కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత టీడీపీ నేతల దాష్టీకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా ఓ వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై మూకుమ్మడిగా దాడికి పాల్పడిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని కొరుటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తుమ్మల ప్రసాద్ కుమారుడు తుమ్మల జశ్వంత్ అదే ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ షబ్బీర్‌పై తరచూ గొడవలకు ఉసిగొలిపేవాడు. ఈ క్రమంలో జశ్వంత్ ఇతర ప్రాంతాల నుంచి పది మందిని వెంట బెట్టుకొని రాడ్లు, కర్రలతో షబ్బీర్ ఇంటిపై మంగళవారం మూకుమ్మడిగా దాడి చేశారు. ఇంటి అద్దాలు, లోపల ఉన్న వస్తువులు, ఫ్రిజ్‌తో పాటు ఇతర సామగ్రిని పగులగొట్టారు. అంతటితో ఆగకుండా ఇంట్లో ఉన్న షబ్బీర్ తల్లి బీబీజాన్‌పై కూడా దాడికి ఒడిగట్టారు. ఇంట్లో ఉన్న వారందరినీ చంపేస్తామంటూ కేకలు వేస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. అక్కడే నుంచి షబ్బీర్ బంధువు మహబున్నీసా ఇంటి వద్దకు వెళ్లి గేట్లు పగలుగొట్టి లోనికి ప్రవేశించారు. అక్కడే ఉన్న ఆమెపై దాడికి పాల్పడ్డారు. అంతకు ముందు రోజు రోహిణి అనే మహిళపై గొడవలకు దిగారు. ఈ ఘటనలతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.



దాడిలో ధ్వంసమైన ఫ్రిజ్



పగిలిన ఇంటి అద్దాలు